ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 14 జనవరి 2024

కొండగట్టులో భక్తుల రద్దీ 7లో..
క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి 7లో..

హైవే విస్తరణకు సన్నాహాలు

- ఆర్మూర్ నుంచి మంచిర్యాల రహదారికి ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం
- 143 కిలో మీటర్ల పొడవున్న భూసేకరణ
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి పట్టణాల్లో బైపాస్
- జగిత్యాల జిల్లాలో సుమారు 69.300 కిలోమీటర్ల మేర విస్తరణ
- త్వరలో టెండర్ల ప్రక్రియ షురూ



జగిత్యాల శివారులో కొనసాగుతున్న రహదారి అభివృద్ధి పనులు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆర్మూర్ నుంచి జగిత్యాల జిల్లా మీదుగా మంచిర్యాల వరకు 63వ నంబరు జాతీయ రహదారిని విస్తరించడానికి ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం రెండు లైన్ల రోడ్డుగా ఉన్న జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి శివారుల మీదుగా మంచిర్యాల వరకు 131.8 కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు రూ. 2,529 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ రహదారి నిర్మాణం కోసం భారీగా భూ సేకరణ చేపట్టాల్సి రావడం, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో కొంత జాప్యం ఏర్పడింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఎన్‌హెచ్‌ఏఐకి హామీ ఇచ్చిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తోంది.

గతంలో జాతీయ రహదారిని విస్తరించడానికి నిర్ణయించగా కొన్ని పట్టణాల్లో ఇళ్లు, భవనాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండడంతో ఆయా చోట్ల బైపాస్ రోడ్లను నిర్మించాలని కొత్తగా ప్రతిపాదించారు. గతంలో జాతీయ రహదారిని విస్తరించాలని నిర్ణయించిన సమయంలో జిల్లాలో సుమారు 200 హెక్టార్ల భూమిని సేకరించాలని గుర్తించారు. ఇప్పుడు కొత్తగా చేసిన ప్రతిపాదనల్లో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాలలో బైపాస్ రోడ్లను నిర్మించాలని నిర్ణయించడంతో 304 హెక్టార్ల భూమిని సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారీ, భూసేకరణకు అనవరమైన సర్వే పనులను అధికారులు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన జె అండ్ కె ఏజెన్సీ డీపీఆర్ పనులను నిర్వహిస్తోంది.

జిల్లాలో 69 కిలో మీటర్ల విస్తరణ..

నిజామాబాద్ జిల్లా బోదన్ నుంచి జగిత్యాల, మంచిర్యాల మీదుగా మహారాష్ట్రలోని సిరొంచ నుంచి చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు 63వ నంబరు జాతీయ రహదారి విస్తరించి ఉంది. 2017 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించాలని తలపెట్టినప్పటికీ పలు కారణాల వల్ల సంబంధిత అంశాన్ని పక్కనబెట్టారు. పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు 143 కిలో మీటర్ల దూరం ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని ఫోర్‌లైన్స్‌గా విస్తరించడానికి నిర్ణయించారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 30.900 కిలో మీటర్లు, జగిత్యాల జిల్లాలో 69.300 కిలో మీటర్లు, మంచిర్యాల జిల్లాలో 41.813 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి డివిజన్‌లో 14 కిలో మీటర్లు, కోరుట్ల డివిజన్‌లో 17 కిలోమీటర్లు, జగిత్యాల డివిజన్‌లో 38 కిలోమీటర్ల మేర నాలుగు వరసల రహదారి విస్తరణ జరుపనున్నారు. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ ప్రాంతంలో గల 44వ నంబరు జాతీయ రహదారి నుంచి మోర్తాడ్, కమ్మరిపల్లి, జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం బ్రిడ్జి మీదుగా మంచిర్యాల జిల్లా లక్షెట్‌పేట్, క్యాతన్‌పల్లి, వేంపల్లి, రంగంపేట వరకు నాలుగు రహదారుల విస్తరణ జరుపనున్నారు.

కొనసాగుతున్న భూ సేకరణ సర్వే పనులు...

జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లలో భూ సేకరణ పనులను రెవెన్యూ అధికారులు వేగవంతం గా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లో 57 హెక్టార్లు, కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లో 80 హెక్టార్లు, జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 167 హెక్టార్ల భూమిని సేకరించడానికి సర్వే పనులు జరుగుతున్నాయి. మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లోని బండలింగాపూర్, మేడిపల్లి(పడమర), వెల్లుల్ల, చౌలమద్ది, పెద్దాపూర్, కోరుట్ల రెవెన్యూ డివిజన్ పరిదిలోని కోరుట్ల, ఎకిన్‌పూర్, వెంకటాపూర్, గుంలాపూర్, మేడిపల్లి గ్రామాల్లో భూ సేకరణ పనులు జరుగుతున్నాయి. అదే విధంగా జగిత్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని తాటిపల్లి, చల్‌గల్, పోరండ్ల, తిప్పన్నపేట, కండ్లపల్లి, పొలాస, అనంతరాం, యశ్వంత రావుపేట, కల్లెడ, బుగ్గారం, మద్దునూరు, గోపాలపూర్, రాయపట్నం తదితర గ్రామాల్లో భూసేకరణ పనులను రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్నారు.

భూసేకరణకు సర్వే పనులు నిర్వహిస్తున్నాము
నరసింహమూర్తి, ఆర్డీవో, జగిత్యాల



ఆర్మూర్ నుంచి మంచిర్యాల రహదారిని ఫోర్ లైన్స్‌గా విస్తరించడంలో భాగంగా జగిత్యాల జిల్లాలో భూసేకరణ సర్వే పనులు నిర్వహిస్తున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన ఆదేశాలు అందాయి. దీంతో రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో సర్వే జరుపు తున్నాము. ఎన్‌హెచ్‌ఏఐ అందించిన వివరాల మేరకు ఆయా గ్రామా ల్లో ఎక్కడెక్కడ ఏఏ రైతు భూమి ఎంత ఎంత సేకరించాల్సి ఉందో గుర్తిస్తున్నాము.

వ్యవసాయ భూములకు ముప్పు..

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం భూసేకరణ చేయాలని నిర్ణయించగా జిల్లాలో సుమారు 304 హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఈ భూమి సేకరణ కోసం మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల రెవె న్యూ డివిజన్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సేకరించాల్సిన భూమి సర్వే నంబర్లు, పట్టదారుల పేర్లతో రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. భూసేకరణ పూర్తి చేసిన అనంతరం రోడ్ల విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. జిల్లాలో పలు గ్రామాల్లో విలువయిన పంట భూములను కోల్పోవలసి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఎస్సారెస్పీ, రైల్వేలైన్‌లకు..

జిల్లాలో గతంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, ఉప కాలువలు, వరద కాలువ, రైల్వే లైన్, శ్రీరాంసాగర్ పునర్జీవం పథకం కింద పంప్‌హౌజ్ తదితర వాటి కోసం ఎంతో విలువైన భూములను కోల్పోగా ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణం కోసం భూములను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో తాము వ్యవసాయం చేయడానికి భూమి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన గల భూములు ఎకరానికి రూ. 40 లక్షల నుంచి 50 లక్షల రూపాయల పైగానే ధరలున్నాయి. హైవే విస్తరణలో భాగంగా భూములు కోల్పోయే తమకు ప్రభుత్వం అంత ధర చెల్లించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు చేసుకునే భూములు కోల్పోవడంతో ఉపాధికి దూరమవుతామని వాపోతున్నారు. నాలుగు లైన్ల రహదారి నిర్మించనుండడంతో ఎకరం, రెండెకరాల భూమి ఉన్న రైతులు పూర్తిగా కోల్పోవలిసిన పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో బైపాస్ రహదారులను ప్రతిపాదిస్తుండడంతో అధిక మొత్తంలో భూములు కోల్పోయే ప్రమాదముందని ఆవేదనకు గురవుతున్నారు.

జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణ బాద్యతలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుందని, భూములు కోల్పోతున్న రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



జగిత్యాల జిల్లా గుండా వెళ్తున్న 63వ నంబరు జాతీయ రహదారి

త్వరలో బీటీ రోడ్ల నిర్మాణం
ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 13: మండలంలో త్వరలోనే బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలో జీవన్‌రెడ్డి శనివారం పర్యటించారు. రాయికల్ నుంచి కుమ్మరిపల్లి, మైతాపూర్ గ్రామాలకు లింక్ రోడ్డు బీటీ రోడ్డు అయ్యే వ్యయాన్ని అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జనవరి చివరిలోపు రవాణా జరిగేలా పనులు మొదలుపెట్టాలని, రోడ్డు నిర్మాణానికి అంచనా వేసి తెలపాలని సూచించారు. ఇటిక్యాల గ్రామంలో ఎస్సీ కాలనీ మూల నుంచి ఒడ్డెర కాలనీ వయా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే రోడ్డు మరమ్మతులు, నిర్మాణాలకు కృషి చేస్తానని తెలిపారు.

ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి

మల్యాల, జనవరి 13: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే వివిధ దుకాణాల ముందు ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఈవో వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ధరలు పట్టికలు లేకపోవడంతో భక్తుల నుంచి అధిక ధరలతో వ్యాపారులు దోపిడికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కొబ్బరికాయను టెండర్‌కు విరుద్ధంగా పసుపు, కుంకుమ కలిపి రూ.40కి విక్రయిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే భక్తులతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి బొద్దుల మహేందర్, ముదాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
పెగడపల్లి ఎస్ఐ సతీష్



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీష్

పెగడపల్లి, జనవరి 13 : సంక్రాంతి పండగకు ఊరెళ్లే వారు పోలీసు శాఖ సూచనలు పాటించి దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని పెగడపల్లి ఎస్ఐ సీహెచ్ సతీష్ పేర్కొన్నారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆటోకు మైక్ ద్వారా పలు సూచనలు చేస్తూ ప్రచారం నిర్వహించడంతో పాటు శనివారం మండల కేంద్రంలో ఎస్ఐ సతీష్ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని లేదా వెంట తీసుకెల్లాలని, ఊరెళ్లేటపుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని, వీలైతే హోం అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో ఏఎస్ఐ సత్తయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బొమ్మెన, గంభీర్‌పూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కథలాపూర్, జనవరి 13: మండలంలోని బొమ్మెన, గంభీర్‌పూర్ గ్రామాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పర్యటిస్తారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం ఒక ప్రనటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో కృతజ్ఞతా ర్యాలీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

వ్యవసాయ పంప్ సెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంప్ సెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదని, సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై ట్రాన్స్‌ఫార్మర్లను అనుసంధానం మాత్రమే చేస్తున్నామని జగిత్యాల ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, మెట్‌పల్లి డీఈ తిరుపతి, ఏడీ దురిశెట్టి మనోహర్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై ట్రాన్స్‌ఫార్మర్ల అనుసంధానం మ్యాపింగ్ ప్రక్రియ 2021 సంవత్సరం నుంచి అమలులో ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులు, వినియోగదారులు ఎలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు.

ఖాదీ, మున్సిపల్ అధికారులపై సీబీసీఐడీతో విచారణ చేపట్టాలి
- బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్

మెట్‌పల్లి, జనవరి 13: ఖాదీ, మున్సిపల్ బకాయిలు చెల్లింపుల విషయంలో ఆ శాఖల అధికారులపై సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఖాదీ భూములు, మున్సిపల్ బకాయిలు చెల్లింపుల విషయంలో గతంలో సమాచార హక్కు చట్టం ద్వారా రెండుసార్లు కోరితే తప్పుడు సమాచారం ఇచ్చారని, ఇటీవల ఖాదీ అధికారులు రూ. 50లక్షలకు గానూ రూ. 13లక్షలు చెల్లించామని పేర్కొన్నారు. కానీ సమచారం ఇచ్చిన పత్రంలో తప్పుడు లెక్కలు చెప్పారని ఆరోపిస్తు వారిపై సీబీసీఐడీతో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికెల నవీన్, ఉపాధ్యక్షుడు బండారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మద్దులపల్లిలో తెగిపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్



రాయపట్నంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి, జనవరి 13: ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లిలో పంటపొలాలకు వెళ్లే దారిలో కొద్ది రోజుల క్రితం వర్షాలకు దెబ్బతిన్న బ్రిడ్జిని శనివారం పార్టీ మండల నాయకులతో కలిసి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పునర్నిర్మాణానికి అవసరమయ్యే ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలని వెంటనే నిధులు మంజూరు చేయనున్నట్లు సంబంధిత శాఖ ఈఈతో లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, బతికెపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, సంధి మల్లారెడ్డి, ఆకుల విష్ణు, బలరాంరెడ్డి, సత్తిరెడ్డి, తిరుపతి, అనీల్, భాస్కర్, వంశీదర్ రావు, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

- **క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగు**

ధర్మపురి: క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో గోళ్ల కిషన్ (రెడ్డి) జ్ఞాపకార్థం మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మొదటిసారిగా గ్రామస్థులు, యువకులు తనను క్రీడా కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలో క్రీడాకారులకు ప్రభుత్వం తరఫున అన్నివిధాల అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. క్రీడకారుల కోసం గ్రౌండ్ ఏర్పాటు చేయడం కోసం సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన తెలిపారు. క్రీడాకారులు గెలుపు ఓటమి అనేది సమానంగా పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. రాయపట్నం గ్రామంలో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేలా చూస్తానని ఆయన అన్నారు. అంతకు ముందు గ్రామస్థులు ఆయనకు స్వాగతం పలికారు. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. యువకులతో కలిసి బ్యాటింగ్ చేసి మ్యాచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షుడు రాందేని మొగిలి, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అప్పం తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, సుముఖ్, అంజి, దేవవరం, శరత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు: కొప్పుల



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్


పెగడపల్లి, జనవరి 13: ఎన్నికల్లో ఓడిపోయామని కార్యకర్తలు అధైర్యపడవద్దని, గెలుపోటములను సమానంగా స్వీకరించి మనోధైర్యంతో ముందుకు సాగాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయామని దిగులు చెందకుండా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని , పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా కలసికట్టుగా పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి గెలుపోటములు, రాజీనామలు కొత్తేమి కాదని, ఓటమి చెందామని దిగులు చెందవద్దని ప్రజల్లో ఇప్పటికే మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామనే భావన ప్రారంభమైందన్నారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కలసికట్టుగా పనిచేయాలని ఈశ్వర్ కోరారు. సమావేశంలో ఎంపీపీ గోళి శోభాసురేందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఓరుగంటి రమణారావు, సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, పార్టీ నాయకులు మల్లారెడ్డి, కరుణాకర్ రావు, పుల్లూరి సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి, రాజు, ఇరుగురాల ఆనందం, నర్సింహారెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జువ్వాడి నర్సింగరావుకు సన్మానం

మెట్‌పల్లి, జనవరి 13: కోరుట్ల నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును పార్టీ కౌన్సిలర్లు సన్మానం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ. 10కోట్లు మంజూరు చేయించిన జువ్వాడికి శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



జువ్వాడి నర్సింగరావును సన్మానిస్తున్న కౌన్సిలర్లు







బావిలో పడి ఒకరి మృతి

బోయినపల్లి, జనవరి 13: మండల కేంద్రంలో శనివారం పుల్లూరి అంజనేయులు (45) ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అంజనేయులు సిరిసిల్లలో మరమగ్గాల కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 11 గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన అంజనేయులు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. అంజనేయులు భార్య లలిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు : ఒకరు మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 13: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు కారు బావిలో పడి ఒకరు మృతిచెందగా, ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దకల్వలకు వెళ్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో రంగంపల్లికి చెందిన వినిత్‌రెడ్డి(27) మృతి చెందగా, కారులో ఉన్న గాదె అఖిల్, అల్లం బాల అనురోహిత్‌రెడ్డి, సాయిలు బావి పైప్ ద్వారా బయటికి వచ్చి క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుజరాత్‌వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్‌కు చెందిన కులదీప్ కుమార్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన కులదీప్‌కుమార్ ఓ బీడీ కంపెనీలో పనులు చేస్తుండేవాడన్నారు. ఈ నెల 10న గంభీరావుపేటకు చెందిన కిషోర్‌తో కులదీప్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తుండగా గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టిందన్నారు. దీంతో కులదీప్‌కుమార్, కిషోర్ తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. కులదీప్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మొదట సిరిసిల్లకు తరలించారని, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ కులదీప్‌కుమార్ శనివారం మృతి చెందాడన్నారు.

వెంకటయ్యపల్లిలో..

గంగాధర: గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన రావుల లచ్చగౌడ్(58) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. లచ్చగౌడ్ గతేడాది డిసెంబరు 26న ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా కురి క్యాల శివారులో నిలిపివేసిన లారీని వెనక నుంచి ఢీకొట్టాడన్నారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

మద్యం మానుకోవాలన్నందుకు ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో మద్యం మానుకోవాలని మందలించినందుకు రంగు దేవయ్య(49) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణాకు చెందిన దేవయ్య నాలుగేళ్ల కిందట భార్య పిల్లలతో కలిసి ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు వలస వచ్చాడు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. స్థానికంగా మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పంట దిగుబడి తగ్గడంతోపాటు కుటుంబ పోషణకు సుమారు రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. తరుచూ ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటుండేవి. మూడు రోజుల కిందట గొడవ జరగగా, ఇంటి ఎదురుగా ఉన్న నారాయణ మందలించడంతో ఆయనపై దాడికి దిగాడు. రోజూ తాగొచ్చి గొడవపడుతున్నావంటూ తాగుడు మానుకోవాలంటూ భార్య బాలవ్వ దేవయ్య మధ్య శుక్రవారం రాత్రి వాగ్వాదం చోటుచేకుంది. శనివారం ఉదయం లేచి చూసే సరికి దేవయ్య ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకల్వలలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వలకు చెందిన నర్ల పోచాలు (58) మద్యానికి బానిసై మానసిక వేదనతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ2 మల్లేష్ తెలిపారు.

భవనం పైనుంచి పడి మధ్యప్రదేశ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి13: భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పైనుంచి పడి మధ్యప్రదేశ్ రాష్ట్రం బాల్‌గాటు జిల్లాకు చెందిన లకనో కోహెర్ (34)మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లకనో కోహెర్ కుటుంబం ఏడాది కిందట కరీంనగర్‌కు వచ్చి కొత్తపల్లిలోని ఒక భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. శనివారం భవనంలోని నాలుగో అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయని, ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వర కట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్ర హించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి (ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకుపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.


ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 13: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

సిర్పూర్ ఎమ్మెల్యే పూజలు


అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్-కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు సత్కరించారు. అలాగే ఖమ్మం అడిషనల్ న్యాయమూర్తి గుర్రం శ్రీనివాస్ కూడా అంజన్నను దర్శించుకున్నారు

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి

జగిత్యాల అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

కొడిమ్యాల, జనవరి 13: క్రీడలు క్రీడాకారుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఆర్ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని నమిళికొండ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నమిళికొండ పోలీస్ బృందం వారు నిర్వహిస్తున్న వాలీబాల్ ఆటల పోటీలను అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతీ వ్యక్తిలో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నమిళికొండ గ్రామం నుంచి పలువురు పోలీస్ ఉద్యోగాలు చేస్తు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారకార్థం ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బీం రావు(ఏఆర్), జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సీఎస్ఎస్ సీఐ వేంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఎస్సై కె వెంకట్‌రావు, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచు అనితనరేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జి. లక్ష్మణ్, ఎం క్రిష్టారెడ్డి, సీహెచ్ సుధీర్‌రావు, రాంచందర్‌రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి, ఫుడ్ స్పాన్సర్లు లక్ష్మీరాజం, ఇ.శ్రీనివాస్, స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ ఎన్. శ్రీనివాస్, షాబొద్దీన్, టోర్నమెంట్ నిర్వహిస్తున్న నమిళికొండ పోలీస్ బృందం పాల్గొన్నారు. ఈ క్రీడల్లో 42 జట్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు.

రాజన్న ఆలయ పరిసరాల్లో

భక్తిభావాన్ని పెంపొందించాలి..

- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- త్వరలో సీఎంతో సమీక్షకు కసరత్తు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నరసింహుడి ధ్వజ స్తంభం వద్ద మొక్కుతున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

వేములవాడ టౌన్, జనవరి 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో భక్తిభావం పెంపొందేలా చూడాలని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. వేములవాడ ఆలయంలోని చైర్మన్ చాంబర్‌లో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాజన్న ఆలయానికి వచ్చేది పేద, మధ్యతరగతి భక్తులేనని, వారికి కావాల్సిన వసతి సౌకర్యాలను మెరుగు పర్చాలని అన్నారు. దర్శనం సులువుగా అయ్యేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శనాలకు కొత్త నివేదిక తయారు చేయాలన్నారు. వసతి గదుల్లోనూ భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సామాన్య భక్తలు విడిది చేసేందుకు మాస్టర్ ప్లాన్‌కు ఆటంకం కలుగకుండా షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కరీంనగర్‌లోని కల్యాణ మండపం ప్రస్తుతం ప్రాధన్యం లేనందున దాని స్థానంలో ఆదాయాన్ని పెంపొందించే విధంగా కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. రాజన్న ఆలయానికి సంబంధించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి ఆదాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా సమ్మక్క, సారలమ్మ జాతరతోపాటు మహాశివరాత్రి జాతరకు భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, ప్రతాప నవీన్, హరికిషన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డీఈ రఘనందన్ ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ వి అనిల్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అనుబంధ ఆలయాలు, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇనుగంటి రమా వేంకటేశ్వర్‌రావు, అక్కెనపెల్లి సురేందర్, అర్చకులు నంబి నరసింహమూర్తి, అశ్విన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో ..

మల్యాల: రాష్ట్ర దేవాదాయ కమిషనర్ వి అనిల్‌కుమార్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకు న్నారు. కుటుంబ సమేతంగా ఆలయంకు వచ్చిన కమిష నర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్ ఆలయ అధికా రులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సమావేశాలు నిర్వహించకపోవడం, అధికారుల బదిలీపై డైరెక్టర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నరసింహుని ఆలయంలో పెరిగిన రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కూడా తోడు కావటంతో అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో, రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణాలు చేశారు. స్వామి వారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు.

అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహ మూర్తి, అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, సంతోష్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో, గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో ఇసుక డంపులను పరిశీలిస్తున్న పోలీసులు

గన్నేరువరం, జనవరి 13, అక్రమంగా ఇసుక దందాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి హెచ్చరించారు. శనివారం మండలంలోని గుండ్లపల్లి శివారులో ఇసుక డంపులపై ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 17 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుండ్లపల్లి శివారులో పలుచోట్ల అక్రమంగా ఇసుక డంపులను పోసి రాత్రి వేళలో సిద్దిపేట, హైదరాబాద్‌కు తరలిస్తున్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

మెట్‌పల్లి రూరల్: అక్రమంగా ఇసుకను నిల్వ చేసినా, తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమంతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు సమచారం అందగా ఆర్ఐ ఉమేశ్‌తో కలిసి దాడులు నిర్వహించి డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన డంపుల్లో ఇసుక సుమారు 10 ట్రాక్టర్ల కంటే ఎక్కువ ఉండవొచ్చని అంచనా వేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలించినా, నిల్వచేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువకు నీటి విడుదల


ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించారు. చేపలు పట్టేవారు, పశువుల కాపర్లు, రైతులు, సాధారణ ప్రజలు వరద కాలువ వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలాఉండగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 63.185 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 72.908 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 8,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కు లు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూ సెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మొక్కు చెల్లించుకున్న యువసేన సభ్యులు

కొడిమ్యాల, జనవరి 13: మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన కమలాకరన్న యువసేన సభ్యులు పూండ్ర మధు, బైరి సంజీవ్ చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలిచిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో తల నీలాలు తీసుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత గుండ్లు తీయించుకుంటామని ఆంజనేయస్వామికి మొక్కుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు సురకంటి ముత్యంరెడ్డి, గ్రామస్థులు రాజయ్య, మహేష్, శేఖర్, శ్రీనివాస్, శ్రీకర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

మల్యాల: చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం విజయం కాంక్షిస్తూ మొక్కులు పెట్టుకున్న రామన్నపేటకు చెందిన క్యాతం నర్సింహారెడ్డి శనివారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించాడు. సత్యం ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో 101 కొబ్బరికాయలు కొట్టాడు. వెల్మ లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, ఎర్రన్న, వలీ, మారంపల్లి గంగాధర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, ఆర్మీ శ్రీనివాస్, నేరెళ్ల నర్సింహారెడ్డి, కిషన్‌రెడ్డి, నక్క అనిల్, ముద్దం శ్రీనివాస్, మర్రి లక్ష్మన్, ప్రశాంత్ పాల్గొన్నారు

వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన



సూపర్‌మార్కెట్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

గొల్లపల్లి, జనవరి 13: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గొల్లపల్లిలోని రాఘవేంద్ర సూపర్‌మార్కెట్, శ్రీలక్ష్మీ సూపర్ మార్కెట్‌ను సందర్శించి వ్యాపారానికి సంబంధించిన మెళకువలను, స్టోర్‌ను డిజైన్ చేసే విధానం, కొనుగోలు, అమ్మకం, వినియోగదారులతో మాట్లాడే విధానం, బిల్లింగ్ ప్రాసెస్ వంటి విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో సొంతంగా వ్యాపారం చేయడానికి, వివిధ రిటైల్ రంగంలో ఉద్యోగాలు త్వరగా పొందడానికి ఇలాంటి అవగాహన సదస్సులు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, రిటైల్ వృత్తి విద్య అధ్యాపకుడు నూతి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, జనవరి 13: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా శనివారం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, జనవరి 13: మండలంలోని పలువురు బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం పరామర్శించారు. టీపీసీసీ సభ్యుడు గోగూరి మహిపాల్‌రెడ్డి తల్లి గోగూరి ఎల్లవ్వ మండలంలోని సంద్రల్లపల్లి గ్రామంలో, మండల కేంద్రంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న గుమ్మడి ధర్మపురి, కొడిమ్యాల గ్రామానికి చెందిన రోహన్, రాహుల్ అనె యువకులు ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సర్పంచు మహిపాల్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మహేష్, వేణు, రమేష్, రాజ్‌కుమార్, మల్లేశం, శుకూర్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: నూకపెల్లి సింగిల్‌విండో చైర్మన్ బోయినిపెల్లి మధుసూదన్‌రావు తండ్రి దామోదర్‌రావుకు మోకాలి శస్త్ర చికిత్ర జరగగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట పోతారం విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మిట్టపెల్లి సుదర్శన్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసం శివ, అరుణ్‌రావు, ప్రవీణ్, మల్లారెడ్డి, జోగినిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయికల్, జనవరి 13: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా పది మంది నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ డీసీ మ్యాకల రమేష్ మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ అనే వ్యక్తితో ప్రారంభమైన లయన్స్ సేవా సంస్థ 1.4 మిలియన్ల సేవకులతో ప్రపంచవ్యాప్తంగా నిత్యం సామాజిక సేవలను చేయడం హర్షదాయకమని అన్నారు. మెల్విన్ జోన్స్ స్ఫూర్తితో అవసరార్థులకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీ బత్తిని భూమయ్య, అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, కోశాధికారి గంట్యాల ప్రవీణ్, లయన్స్ క్లబ్ సభ్యులు ఎద్దండి దివాకర్, కడకుంట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు పట్టణంలోని లయన్స్ క్లబ్ మరియు కోటి నవదుర్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్ మాట్లాడుతూ ఒక్కడితో ఏర్పడ్డ లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా 1.4 మిలియన్ల మందితో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నా యని పేర్కొన్నారు. స్వార్థాన్ని విడనాడి పేదలకు కొంత సాయం చేసే గుణం అలవరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ కుందారపు మహేందర్, కోశాధికారి కొండబత్తిని అనంత ప్రసాద్, మహిళా క్లబ్ సెక్రటరీ కుందారపు ప్రేమలత, దిలీప్‌రావు, అల్లాడి ప్రవీణ్, చంద్రప్రకాశ్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా పట్టణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్‌జేఎఫ్ సభ్యులైన ఐదుగురు వడ్డేపల్లి శ్రీనివాస్, మహాజన్ నర్సింహులు, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, గంగుల మురళి, ముద్దం రాజేంద్రప్రసాద్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల అంజేయులు శాలువలు, పూలమాలలతో ఘణంగా సన్మానించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి ఇల్లెందుల శ్రీధర్, దొంతుల రాజ్‌కుమార్, చర్లపల్లి అరుణ్‌దీప్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో డ్రైవర్లు, కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజన ప్యాకెట్లను సభ్యులు పంపిణీ చేశారు. శనివారం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆటో, జీప్ డ్రైవర్లకు, కార్మికులకు ఉచితంగా భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీ శివ శ్రీనివాస్, అధ్యక్షుడు కనుక సంజీవ్, సభ్యులు క్యాతం సురేష్‌రెడ్డి, ముత్యాల రమేష్, మోర సతీష్, గూడూరి నవీన్‌కుమార్, బెజ్జారపు ధనుష్ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణోత్సవం



ధర్మపురిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో..



కొడిమ్యాల మండలం పూడూర్‌లో..

ధర్మపురి, జనవరి 13: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఆవరణలో గోదారంగనాథుల కల్యాణోత్సం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం వేళలో మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదాదేవి, రంగనాథుల ఉత్సవమూర్తులను అందంగా పూలతో అలంకరించిన వేదిక పైకి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారి నిత్య కళ్యాణం, స్వస్తి పుణ్యాహవచనం, శ్రీపురుష సూక్తం, లక్ష్మీసూక్తంతో అభిషేకం, హారతి, మంత్ర పుష్పం కార్యక్ర మాలు నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని జరిపించారు. అనేక మంది భక్తులు పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సామవేద పండితులు ముత్యాలశర్మ, ముఖ్య అర్చకులు నరసింహార్తి, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇనుగంటి రమావేంకటేశ్వర్‌రావు, గందె పద్మ-శ్రీనివాస్, అక్కెనపెల్లి సురేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి దేవాలయంలో శనివారం వేద బ్రాహ్మణులు ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదా దేవి రంగనాయకుల స్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు సామూహిక విష్ణు పారాయణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించి కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్‌లో గల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర, శ్రీ శివభక్త మార్కండేయ, ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం గోదారంగనాథస్వామి కల్యాణం వైభవంగా పండితులు నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని పూడూర్ గ్రామానికి చెందిన తిరనహరి శారద కుటుంబ సభ్యులు నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు కవితరవికుమార్, మాజీ ఎంపీపీ రామస్వామి, మాజీ సర్పంచు లింగాగౌడ్, పద్మశాలీ సంఘం సభ్యులు, గ్రామ ప్రముఖులు, పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని గుళ్లకోటలోగల వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన గోదాదేవి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, గొల్లపెల్లి మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీజ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని అతిపురాతన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కళ్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చా రు. మహిళలు మంగళహారతులతో స్వామివారిని ఊరేగించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని మెట్లచిట్టాపూర్‌లోగల శ్రీ సీతారామ స్వామి ఆలయంలో, వేంపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం వైభవంగా జరిగింది. సర్పంచు బద్దం శేఖర్‌రెడ్డి దంపతులు కల్యాణంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి కల్యాణం తిలకించ డానికి మండలంలోని పలు గ్రామాల్లోని భక్తులు తరలివచ్చారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో రంగనాథస్వామి గోదాదేవి కళ్యాణం కమనీయంగా జరిగింది. అర్చకులు, వేద మంత్రోచ్ఛరణల మధ్య కళ్యాణం కన్నుల పండవగా నిర్వహించారు. వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బోయినపల్లి సత్యనారాయణరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరమాండ్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంతం రాజం, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణంను కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు, కమిటీ నిర్వహకులు మహాజన్ నరసింహులు దంపతులు ఘనంగా జరిపించారు. ఆలయంలోని స్వామి వారికి పురోహితులు బృందం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హారతి, హోమం వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్, సరోజ దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను మసర్పించారు. పట్టణంలోని భక్తులు, ప్రజలు స్వామి వారి కల్యాణంలో పాల్గొని ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఖాదీ మేనేజర్ మహదేవ్, మంచాల రవీందర్, గంగాధర్, దొంతుల రాజుకుమార్, సుతారి అంజయ్య, మహాజన్ శివకుమార్, వెంకట్‌రాములు, దొంతుల శివకుమార్, రాంగోపాల్, మురళి, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట, రాఘవుపేట గ్రామాల్లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదా రంగనాయకుల కల్యాణం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రాఘవుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, వాసవి మాత ఆలయాల్లో జరిగిన గోదాదేవి రంగనాధుల కల్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు పాల్గొని స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



కథలాపూర్ మండలంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ



కోరుట్లలో అక్షింతలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

కోరుట్ల, జనవరి 13: పట్టణంలోని 16వ వార్డులో అయోధ్య రామయ్య అక్షింతలను కౌన్సిలర్ బలిజ పద్మరాజారెడ్డి గడప గడపకూ శనివారం పంపిణీ చేశారు. ఈ నెల 22న ఆయోధ్యలో రామమందిరం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఇంటిలో ఐదు దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. అతిపురాతనమైన మహాదేవస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గెల్లి గంగాధర్, గట్ల శివకుమార్, రవికుమార్, వినోద్, శ్రావణ్, సచిన్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

కథలాపూర్: ఈ నెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభిస్తున్న నేపథ్యంలో గ్రామాలకు అక్షింతలు కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేయగా మండలంలోని చింతకుంటలో అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు.

రథంపై రాముని విగ్రహాలను ఏర్పాటు చేసి రామనామ స్మరణతో డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైర హేమలతమల్లేశ్, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ బొడ్డు బాలు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం

ఎండపల్లి, జనవరి 13: మండలంలోని పాతగూడూర్ గ్రామంలోని నిరుపే ద కుటుంబానికి చెందిన రామిళ్ల బానయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారం చేయడానికి డబ్బులు లేకపోవడంతో విషయం తెలిసిన వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు దహన సంస్కారాలకు ఖర్చులకు వారి కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం అందజేశాడు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎండపల్లి, జనవరి 13: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం నుంచి వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ (వ్యాళ్ళ హరీష్‌రెడ్డి ఎన్‌ఆర్‌ఐ) సౌజన్యంతో వేంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు నేడు ప్రారం భం కానున్నాయి. ఈ టోర్నీ మూడు రోజులు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి 20 వేలు, రెండో బహుమతి 15 వేలు, మూడూ, నాలుగో బహుమతి ఐదు వేల రూపాలయ చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. టోర్నీలో దాదాపుగా 45 జట్ల వరకు పాల్గొననున్నట్టు యూత్ సభ్యులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ధర్మపురి, జనవరి 13: ధర్మపురి మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘం పక్షాన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ధర్మపురి మండల అధ్యక్షుడు మచ్చ సత్యం, ప్రధాన కార్యదర్శి గడ్డం అనిల్, పట్టణ అధ్యక్షులు కొంక వరప్రసాద్, మండల పోపా అధ్యక్షులు బోగ శివప్రసాద్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై అసత్య ఆరోపణలు సరికాదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 13 : మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో బీఆర్‌ఎస్ స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీల ప్రోద్బలంతో జరిగిందని అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండే రమేష్‌లు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టిన వాటి బిల్లులు గురించి ఎన్ని సార్లు సర్పంచును అడిగిన ఫలితం లేదు. దీంతో గ్రామ పెద్ద మనిషితో అడగా సర్పంచు మేనల్లుడు ఆకుల శ్రీనివాస్ అడ్డుపడుతున్నాడని వారికి తెలిపాడు. దీంతో ఆయనను బిల్లులను ఎందుకు అడ్డుకుంటున్నవని నిలదీసినందుకు ఇష్టం వచ్చినట్లు తిట్టిడంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది, ఇదే విషయంపై గతంలో మెండే రమేష్‌పై ఆకుల శ్రీనువాస్ దాడి చేయగా చెయి విరిగిడంతో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. మళ్లీ అదే విధంగా శ్రీనువాస్ ఆయన కొడుకుతో దాడి చేయడమే కాకుండా బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేయడం దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కోరుట్ల, జనవరి 13: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి కోటి నవదుర్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో సిహెచ్ మేఘన మొదటి బహుమతి ఎల్‌ఈడీ టీవీ, ఎం లావణ్య ద్వితీయ బహుమతి తావా సెట్, సీహెచ్ వెన్నెల తావా సెట్, శ్రీనిధి తృతీయ బహుమతి హాట్ బాక్స్ గెలుచుకున్నారు. బహుమతులను లయన్ వనపర్తి రమ్య, కుందారపు ప్రేమలత, కొండబత్తిని రాధిక, చాప వందన, భారతి, సుజాత విరాళం అందించారు. న్యాయ నిర్ణేతలుగా వైద్యులు స్వీతీ అనూప్, ప్రియాంక, అనురాధ, శృతిఅన్వేష్‌లు వ్యవహరించారు. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య బహుమతులు అందజేశారు.

ఘనంగా ముందస్తు భోగి మంటలు

కొడిమ్యాల, జనవరి 13: మండల కేంద్రంలోని అంగడి బజారులో శనివారం రాత్రి ముందస్తు భోగి మంటలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగడి బజారు ప్రాంత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండప పనులకు నిధుల మంజూరుకు కృషి



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు

కోరుట్ల, జనవరి 13: పట్టణంలోని కల్యాణ మండపం, షాదీఖానా మిగులు పనుల పూర్తి కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపాలను పరిశీలించారు. తన తండ్రి జువ్వాడి రత్నాకర్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఈ పనులు చేసారని మిగులు పనులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోని కారణంగా పూర్తి కాలేదని విమర్శించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజోజు సదానందచారి, పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, అంకం ప్రకాశ్, రిజ్వాన్, రహీం, చిట్యాల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

- పట్టణ శివారులో అడ్డాలు
- రైస్‌మిల్లులే కేంద్రంగా నిర్వహణ
- పీడీఎస్ రైస్ సేకరణకు ప్రత్యేక టీమ్‌లు
- పట్టించుకోని అధికారులు



గొల్లపల్లి, జనవరి 13: పేదల దరికి చేరాల్సిన ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిఘా పెరగడంతో రెండు నెలలు బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. ఎన్నికలు పూర్తి కాగానే మళ్లీ బియ్యం దందా జోరందుకుంది. గొల్లపల్లి, తిర్మలాపూర్, గుంజపడుగు తదితర గ్రామాలు కేంద్రాలుగా బియ్యం దందా సాగుతోంది. గొల్లపల్లి శివారులోని రైస్‌మిల్లులనే అక్రమార్కులు అడ్డాగా చేసుకుని దందా చేపడుతున్నారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని కిరాయికి తీసుకున్న ఇళ్లల్లో నిల్వ చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లారీలు, డీసీఎంలలో సరిహద్దులు దాటిస్తున్నారు. అధికారుల అండదండలతో బియ్యం మాఫియా దందాను నిర్వహిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఏజెంట్లు సేకరించిన బియ్యాన్ని ఒకరిద్దరు దళారులు కిలో రూ.8 వరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో కిలో రూ.18 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. ఒక లారీ బియ్యం సరిహద్దులు దాటితే రూ.3 లక్షల వరకు లాభం చేకూరుతున్నట్లు సమాచారం. దీంతో ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు రెచ్చిపోతుండగా, మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ దందాలో ఆరితేరిన కేటుగాళ్లు తమకు అనుకూలమైన పరిస్థితులను తీసుకువచ్చేందుకు చక్రం తిప్పడం మొదలుపెట్టినట్లు సమాచారం. రాజకీయ అండదండలు, అర్థ బలం ఆసరా చేసుకుని ఈ దందాను లాభార్జనకు మార్గంగా మల్చుకుంటున్నారు. తండాలు, గ్రామాల్లో చైన్ సిస్టమ్ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారు. రేషన్ షాపుల నుంచి కార్డుల ద్వారా తీసుకుంటున్న బియ్యాన్ని సేకరించి పెద్ద మొత్తంలో పోగు చేసే పనులు ఆయా గ్రామాలు, తండాల్లో కొందరికి అప్పగిస్తున్నారు. ఇందుకోసం ఏకంగా ఏజెంట్లను కూడా నియమించుకుంటుడటం గమనార్హం. సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి అదును చూసి పోలీసులు, పౌర సరఫరాల అధికారుల కళ్లు కప్పి లారీలు, వ్యాన్‌లలో తరలిస్తున్నారు.

కొనుగోళ్లకు ఏజెంట్లు..

కొందరు వ్యాపారులు ఇంటింటా తిరిగి బియ్యం సేకరించేందుకు ఏజెంట్లను నియమించుకుంటూ వారు సేకరించిన ధాన్యాన్ని వారు కొనుగోలు చేస్తూ లారీలు, డీసీఎంలలో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గొల్లపల్లి శివారుతో పాటు ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను కొందరు వ్యాపారులు అద్దెకు తీసుకుంటున్నారు. గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఇందులో డంప్ చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా చేసిన తర్వాత ఇక్కడ ఇంటిని ఖాళీ చేసి మరో కాలనీలో అద్దె ఇల్లును ఎంచుకుంటారు. ఇటీవల పోలీసుల తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీలను, డీసీఎం వ్యాన్‌లను పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ దళారుల్లో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం. మహారాష్ట్రలో మన బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. కిలో బియ్యం రూ.18 నుంచి రూ.25 వరకు ధర పలుకుతోంది. ఉమ్మడి జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో రేషన్ కార్డుదారుల నుంచి నుంచి కిలోకు రూ.8కు కొనుగోలు చేసి లారీల్లో రాత్రికి రాత్రే సరిహద్దులు దాటిస్తున్నారు.

అడపాదడపా దాడులే..

గ్రామాల్లో బహిరంగంగా రేషన్ బియ్యం కొనుగోళ్లు జరుగుతున్నా అరికట్టాల్సిన అధికారులు మాత్రం మౌనం దాల్చుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్కడక్కడ అడపాదడపా దాడులే తప్ప ఖచ్చితమైన సమాచారం ఉన్నా దాడులు జరుపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మందిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.